క్లుప్తంగా

హిందీ భవన్ కోసం స్థలం కేటాయించాలి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో హిందీ భవన్ కోసం స్థలం కేటాయించాలని ఎంపీ గోడం నగేశ్‌కు హిందీ భాషా సేవా సమితి సభ్యులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందీ భాష అభ్యున్నతి కోసం హిందీ భవన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా హిందీ దినోత్సవాలు, కవి సమ్మేళనాలు, కార్యక్రమాల నిర్వహణకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే నిరుద్యోగులకు సైతం ఇది ఉపయోగపడుతుందన్నారు. భవనంతో పాటు ప్రత్యేక లైబ్రరీని స్థాపించాలన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు సుకుమార్, దత్తాత్రేయ, మహేశ్, సాంబన్న, చంద్రశేఖర్, ఉద్ధవ్ పాల్గొన్నారు.

మాగంటి గోపినాథ్ మృతి తీరని లోటు

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతి పార్టీకి తీరని లోటని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన అకాల మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న అంకం అశోక్

భీంపూర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మండల అధ్యక్షుడు అంకం అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని మారుగూడ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గుర్ల నారాయణ, నాయకులు స్వామి, సోమేశ్వర్, గంగన్న, చిన్ను, సురేశ్, రాంప్రసాద్, సంజీవ్, పండరి, అనిల్ పాల్గొన్నారు.

దళిత సంఘాల సంబరాలు



సంబరాలు జరుపుకొంటున్న నాయకులు

ఇంద్రవెల్లి: చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి దక్కడంతో ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో దళిత సంఘాల నాయకులు సంబురాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. సామాజిక న్యాయాన్ని పాటిస్తూ మాల (మహార్) కులానికి చెందిన గడ్డ వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, దళిత సంఘాల నాయకులు కామ్‌రాజ్ వాగ్మారే, మస్కే రాజువర్ధన్, సత్యానంత్, శివాజీ, సూర్యవంశీ పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్' నిలిపివేయాలి

ఖానాపూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు కె.తిలక్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టుకున్న మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయకుండా ప్రభుత్వం వెంటనే కోర్టులో హాజరుపరచాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ట

పర్యాటకంపై పట్టింపు కరువు



ఇచ్చోడ మండలంలోని గాయత్రి జలపాతానికి వెళ్లే రోడ్డు

- నియోజకవర్గంలో సప్తగుండాలు
- నిధులు లేక అభివృద్ధికి దూరం

ఇచ్చోడ: పర్యాటక రంగంపై నీలినీడలు కమ్ముకున్నాయి. దక్షిణ కశ్మీర్‌గా పేరున్న జిల్లాలోని బోథ్ నియోజకవర్గంలో సహజ సిద్ధంగా ఏర్పడిన సప్తహ జలపాతాలు ఉన్నాయి. కానీ జలపాతాల వద్ద కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం రోడ్డు మార్గం కూడా లేదు.

ఆదరణ కరువు..

నియోజకవర్గంలో సహజసిద్ధంగా ఏర్పడిన సప్తహ జలపాతాలు ఉన్నాయి. ఇచ్చోడ మండలంలో గాయత్రి, పెద్దగుండం, నేరడిగొండ మండలంలో కుంటాల, కొరిటికల్, బోథ్ మండలంలో పొచ్చెర, ఘన్‌పూర్, బజార్‌హత్నూర్ మండలంలో కనకాయి జలపాతాలు ఉన్నాయి. కుంటాల, పొచ్చెర జలపాతాలు మినహా మిగిలిన జలపాతలకు కనీస రోడ్డు సౌకర్యం లేదు. ఇచ్చోడ మండలంలోని గాయత్రి జలపాతం వద్ద గతంలో రాపెల్లింగ్ పోటీలు నిర్వహించారు. ఎత్తైన కొండల మధ్య 38 అడుగులపై నుంచి జలధారతో చూపరులతో ఆకట్టుకుంటుంది. దాదాపుగా ఆరు కిలో మీటర్ల పొడవున మట్టిరోడ్డు ఉండటంతో పర్యాటకులు అక్కడి అందాలు చూడలేకపోతున్నారు. ఘన్‌పూర్, పెద్దగుండం, కనకాయి లాంటి జలపాతలకు రోడ్లులేక పోవడంతో పర్యాటకులు వెళ్లలేకపోతున్నారు.

కలగానే రోప్‌వే..

ప్రతీ ఏటా జూన్, జూలైలో వర్షాలు కురవడం ప్రారంభం కాగానే జలపాతల వద్ద పర్యాటకుల తాకిడి పెరుగుతుంది. కుంటాల జలపాతం ఎగిసి పడుతున్న నీటిని చూడాలంటే పర్యాటకులు దాదాపుగా 408 వందల మెట్లు కాలినడకన కిందికి దిగితే తప్పా ఆ ఘూటాన్ని చూడటానికి వీలు ఉండదు. వయస్సు పైబడిన వారు కిందికి దిగినా తిరిగి పైకి ఎక్కడం సులువుకాదు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు అందాలను చూడకుండానే వెనుతిరిగి వెళ్తున్నారు. కుంటాల అందాలను వీక్షించాలంటే కింది ప్రాంతం వరకు రోప్‌వే ఏర్పాటు చేయాలని చాలా రోజుల నుంచి డిమాండ్ ఉంది. కానీ ప్రభుత్వాలు పట్టించుకోక పోవడంతో రోప్‌వే కలగానే మిగిలింది.

గాయత్రికి రోడ్డు వేయాలి



ఎత్తయిన రెండు కొండల మధ్య నుంచి 30 అడుగులపై నుంచి జాలువారే గాయత్రి జలపాతానికి రోడ్డు మార్గం లేదు. దీంతో పర్యాటకులు రావడం లేదు. ప్రభుత్వం బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి జలపాతాలను అభివృద్ధి చేయాలి.

– హసన్, గుండి గ్రామస్తుడు

సరైన రహదారి లేదు



బజార్‌హత్నూర్ మండలంలోని కనకాయి జలపాతానికి సరైన రోడ్డు లేక పోవడంతోనే పర్యాటకులు రావడం లేదు. వర్షాకాలంలో కనీసం బైక్ కూడా నడవలేని పరిస్థితి ఉంది. రోడ్డు సౌకర్యం కల్పించి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలి.

– భూమన్న, పర్యాటక ప్రేమికుడు

రోప్‌వే ఏర్పాటు చేయాలి



కుంటాల జలపాతం వద్ద పర్యాటకుల కోసం రోప్‌వే ఏర్పాటు చేయాలి. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వయస్సుపైబడిన వారు కుంటాల అందాలు చూడలేక పోతున్నారు. కనీస సౌకర్యాలు లేక పోవడంతో పర్యాటకుల తాకిడి తగ్గుతుంది. – కొండ మురళి,

కొత్త తెంగాణ చరిత్ర బృందం సభ్యుడు

ప్రమాదాల నియంత్రణపై బల్దియా దృష్టి

- ప్రధాన చౌక్‌ల కుదింపు
- తాజాగా ఎన్టీఆర్‌చౌక్‌లో రెయిలింగ్ తొలగింపు



రెయిలింగ్‌ను కట్ చేస్తున్న సిబ్బంది

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సుందరీకరణ పేరిట చేపట్టిన ప్రధాన చౌక్‌లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. బల్దియా అధికారుల అనాలోచిత నిర్ణయంతో భారీ వెడల్పుతో కోట్లాది రూపాయల వ్యయంతో చౌక్‌లను ఏర్పాటు చేశారు. అయితే పట్టణంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోవడం, చౌక్‌లు కుదించుకుపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వెడల్పు తక్కువ కావడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల కలెక్టర్ చౌక్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రిటైర్డ్ ఉపాధ్యాయుడు టిప్పర్ ఢీకొనడంతో ఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి పరిస్థితులపై ఇటీవల మున్సిపల్, రెవెన్యూ , పోలీస్ అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రమాదాలను నియంత్రించాలని ఆదేశించారు. అందుకు కారణమవుతున్న చౌక్‌ల వెడల్పును కుదించాలని సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాలకనుగుణంగా మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రమాదాలకు కారణమవుతున్న కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్‌ల వెడల్పును కుదించాలని నిర్ణయించారు. ఒక్కో చౌక్‌లో పనులను చేపట్టేందుకు రూ.5 నుంచి రూ.6లక్షల నిధులు అవసరమవుతాయని అంచనా వేశారు. అత్యవసర పనులు కావడంతో పట్టణ మహిళ సమాఖ్య ద్వారా పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇటీవల కలెక్టర్ చౌక్‌ను 7 అడుగుల మేర కుదించే పనులను ప్రారంభించారు. ఖర్చ్ గోడ వరకు గల రెయిలింగ్‌ను, ఆ మేరకు వేసినటువంటి టైల్స్‌ను పూర్తిగా తొలగించారు. అయితే అక్కడ సీసీ రోడ్డును నిర్మించాల్సి ఉండగా, తమ అరాధ్య పోరాట యోధుడు కొమురంభీంను అవమానపర్చారంటూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. దీంతో సీసీరోడ్డు నిర్మాణ ప్రక్రియ నిలిచిపోయినట్లు తెలుస్తోంది. అయితే తాజాగా ఎన్టీఆర్ చౌక్‌లోనూ ఆదివారం కుదింపు పనులు ప్రారంభించారు. చౌక్ చుట్టూ ఉన్నటువంటి రెయిలింగ్‌ను గ్యాస్ కట్టర్‌తో తొలగించే పనులు ప్రారంభించారు. ఖర్చుగోడ వరకు గల రెయిలింగ్‌తో పాటు టైల్స్‌ను తొలగించనున్నారు. అక్కడ సీసీ రోడ్డును నిర్మించనున్నారు. వీటితో పాటు వినాయక్ చౌక్‌లోనూ కుదింపు పనులను సైతం ఈ వారంలోనే చేపడుతామని బల్దియా ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. గతంలోనే చౌక్‌ల ఏర్పాటు సమయంలో అధికారులు ఆలోచించి ఉంటే లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయి ఉండేది కాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. సుందరీకరణ పేరిట కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేసిన అధికారులు ప్రమాదాలను పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిధులు దుర్వినియోగం జరుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సొంత ఖర్చుతో రోడ్డు నిర్మాణం

బోథ్: మండలంలోని పిప్పల్‌ధరి కుడి కాలువ వద్ద రైతులు తమ సొంత ఖర్చులతో రోడ్డు నిర్మించుకుంటున్నారు. తమ భూముల్లోకి వెళ్లేందుకు రోడ్డు సరిగా లేకపోవడం, వానాకాలంలో దారి బురదమయంగా మారడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. కాగా అధికారులకు రోడ్డు వేయాలని విన్నవించినా ఎలాంటి స్పందన లేకపోవడంతో రైతులంతా డబ్బులు పోగు చేసి రోడ్డు వేసుకుంటున్నారు.



రైతులు పోసిన మొరం

ఘనంగా భీమన్న విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న భక్తులు

తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామంలో భక్తిశ్రద్ధలతో ముదిరాజ్‌లు భీమన్న పండుగను ఘనంగా నిర్వహించారు. చెరువు సమీపంలోని పంట పొలాల్లో నూతనంగా నిర్మించిన ఆలయంలో భీమన్న విగ్రహాలను ప్రతిష్ఠించారు. అంతకుముందు నవగ్రహ పూజతో పాటు ఇతర పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఖరీఫ్ సీజన్లో సమృద్ధిగా వర్షాలు పడి పాడి పంటలు పండాలని, ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా ఆయురారోగ్యాలతో ఉండాలని భీమన్న దేవుడిని పూజించడం జరుగుతుందని ముదిరాజ్ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొజ్జ నారాయణ, సలేంద్ర శివయ్య, దారవేణి రాము, కొండ వెంకటి, ఈర్ల సుభాష్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలలో భాగంగా మాదిగల చిరకాల స్వప్నం మంత్రి వర్గంలో అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పదవి ఇవ్వడంతో మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్‌గాంధీ, లక్ష్మణ్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి, రాహుల్ గాంధీలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు మల్యాల స్వామి, మోతే బారికరావు, ప్రధాన కార్యదర్శి గాలిపెల్లి నాగన్న, మల్యాల మనోజ్, ఇజగిరి సంజయ్, ఈర్ల దయాకర్, ప్రభాకర్, ఖదరపు దేవిదాస్, రాజలింగు పాల్గొన్నారు.

శిథిలావస్థలో సర్కారు బడులు



అల్లిగూడలో ఆరుబయట కూర్చున్న విద్యార్థులు (ఫైల్)



శిథిలావస్థకు చేరిన రఘునాథ్‌పూర్ పాఠశాల

- భయాందోళనలో విద్యార్థులు
- పట్టించుకోని పాలకులు

నార్నూర్: సర్కారు బడిలో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, పాలకులు ఆచరణలో మాత్రం ఎక్కడ కూడా సౌకర్యాలు కనిపించడం లేదు. అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో కోట్లాది రూపాయాలు ఖర్చు చేస్తున్నా ఫలితం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 77 ఏళ్లు అవుతున్నా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో ఎటువంటి మార్పు కనిపించడం లేదు. గాదిగూడ మండలంలోని అల్లిగూడ, కునికాసా చిత్రుగూడ, శివనారా, ధర్మగూడ గ్రామాల్లో పాఠశాలలకు సొంత భవనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఒకొక్క పాఠశాలలో 20 నుంచి 30 మంది విద్యార్థులు ఉన్న సరైనా సౌకర్యాలు లేక విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలకు సొంత భవనాలతో పాటు శిథిలావస్థలో ఉన్న పాఠశాలలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇచ్చోడ: బోథ్ మండలంలోని రఘునాథ్‌పూర్ గిరిజన పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. మారుమూల గిరిజన గ్రామమైన రఘునాథ్‌పూర్‌లో ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాల ఉంది. అయితే పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి నూతన భవనం మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య



విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సాత్నాల: ప్రభుత్వ పాఠశాలల్లోని మెరుగైన విద్య లభిస్తుందని ఉపాధ్యాయురాలు నవనీత అన్నారు. ఆదివారం భోరజ్ మండలంలోని పిప్పరవాడ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ల సహాయంతో ఇంటికీ తిరుగుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చేరితే పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ తరగతులు, అన్ని ఉచితంగా లభిస్తాయని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బోన్ల ఆశమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జైనథ్: బడీడు పిల్లను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు రాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, రెండు జతల దుసుతలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ తరగతులు లభిస్తాయన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విట్టల్, బాపూరావు, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో ఆదివారం బడిబాట నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య, సౌకర్యాలు ఉంటాయని ప్రధానోపాధ్యాయులు మహేందర్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్ ప్రహ్లాద్, అనిల్ కుమార్, వైష్ణవి, సాయిప్రియ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆయుర్వేద గుళికలు పంపిణీ



ఆయుర్వేద గుళికలు పంపిణీ చేస్తున్న డాక్టర్

ఆదిలాబాద్‌టౌన్: మృగశిరకార్తే సందర్భంగా ఆయుర్వేద వైద్యుడు యువరాజ్ వైద్య ఆయుర్వేద గుళికలను పంపిణీ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీసీఐ సమీపంలో గల ఆయుర్వేదిక్ రీసెర్చ్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉబ్బసం వ్యాధిగ్రస్తులతో పాటు ఐదేళ్లలోపు చిన్నారులకు రోగనిరోధక శక్తి పెంచేందుకు వీటిని అందించినట్లు తెలిపారు. చిన్న పిల్లలకు డ్రాప్స్ రూపంలో, పెద్దవారికి గుళికల రూపంలో అందించారు. వీటిని తీసుకోవడంతో ఉబ్బసం, శ్వాసకోశ వ్యాధిని నిర్మూలించేందుకు తనవంతుగా యేటా పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, పట్టణానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: 23 ఏళ్ల తర్వాత చదువులమ్మ ఒడిలో పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఎలా ఉన్నావు.. ఏం చేస్తున్నావంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రగతి పాఠశాల విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ గార్డెన్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. తరగతి గదిలోని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రగతి విద్యాలయ కరస్పాండెంట్ వకుళాభరణం ఆదినాథ్ హాజరై మాట్లాడారు. ప్రగతి అంటే చదువు మాత్రమే కాదని, జీవితాంతం నిలిచిపోయే సంబంధాల పుట్టినిల్లు అని చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి, ప్రభాకర్, రవీందర్ రెడ్డి, సూర్య ప్రకాష్, మంజుష, భాగ్యలక్ష్మి, సుధారాణి, సంతోషిని, వరలక్ష్మి, శంకర్ రెడ్డి, స్వాత్మరామ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్



భూమిపూజ చేస్తున్న ఎంపీ గోడం నగేశ్

తలమడుగు: జిల్లాలోని అన్ని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఝరి గ్రామంలోని పురాతనమైన శివాలయంలో ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నా వంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్, కనపర్తి చంద్రకాంత్ భుజంగరావు, కాశిరాం, కిరణ్, వెంకటస్వామి, నారాయణరెడ్డి, రామారెడ్డి, దామిజీ పటేల్, పురుషోత్తం పాల్గొన్నారు.

భక్తి మార్గంలోనే మనశ్శాంతి

ఇంద్రవెల్లి: భక్తిమార్గంలోనే మనశ్శాంతి లభిస్తుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మండలంలోని ఏమాయికుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ మందిరంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన, కళశం ఆవిష్కరణ నిర్వహించారు. హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సురేశ్ మహరాజ్, బీజేపీ నాయకులు ఆరెల్లి రాజలింగు, మెస్రం తుకారం, జగన్‌సింగ్, జాదవ్ లఖన్ పాల్గొన్నారు.

తాంసిలో గాలివాన బీభత్సం



విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

తాంసి: మండలంలో ఆదివారం సాయంత్రం మండలంలోని కప్పర్ల, తాంసి, వడ్డాడి, జామిడి, గిరిగాం, హస్నాపూర్, పొన్నారి, సావర్గాం గ్రామాల్లో వర్షం పడింది. గాలివానకు వడ్డాడి నుంచి పొచ్చెర వరకు ఉన్న రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అలాగే జామిడి గ్రామ శివారులో రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.